క్లుప్తంగా

చేబ్రోలు ఎస్ఐ-1గా ఆనంద్


ఆనంద్

చేబ్రోలు: స్థానిక పోలీసు స్టేషన్ ఎస్ఐ-1గా కె. ఆనంద్ గురువారం బాధ్యతలు చేపట్టారు. స్టేషన్‌లో ఇద్దరు ఎస్ఐలకు గానూ వై. సత్యనారాయణ బదిలీపై వెళ్లడంతో ఖాళీ ఏర్పడింది. ఆయన స్థానంలో గుంటూరు సీసీఎస్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఆనంద్‌ను చేబ్రోలుకు బదిలీ చేస్తూ ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ ఉత్తర్వులు జారీ చేశారు.

పెదనందిపాడు ఎస్ఐగా అబ్దుల్ రెహ్మాన్


అబ్దుల్ రెహ్మాన్

పెదనందిపాడు: స్థానిక పోలీస్ స్టేషన్‌గా ఎస్ఐగా షేక్ అబ్దుల్ రెహ్మాన్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గుంటూరు దిశ పోలీసుస్టేషన్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ప్రస్తుతం ఎస్ఐగా పని చేస్తున్న డి.అశోక్ నల్లపాడు స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు.

పోలీసుల అదుపులో ద్విచక్ర వాహన చోరులు?

పెదకాకాని: ద్విచక్ర వాహనాల చోరుల్ని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పెదకాకాని పోలీసుస్టేషన్ పరిధిలోని శివాలయం, గడ్డిపాడు ప్రాంతాల్లో ఇటీవల రెండు ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. వీటిపై నిఘా పెంచిన పోలీసులు గురువారం నలుగురిని అదుపులోకి విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుంటూరు చానల్‌లో వ్యక్తి గల్లంతు

పెదకాకాని: గుంటూరు చానల్‌లో స్నానానికి దిగి వ్యక్తి గల్లంతైన సంఘటన పెదకాకాని శివారు చోటు చేసుకుంది. సంకూరివారిపేటకు చెందిన బొట్టు బాబ్జి వంట పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. స్నానం నిమిత్తం గురువారం మరో ఇద్దరు స్నేహితులతో కలసి పెదకాకాని శివారులోని గోళ్లమూడి రోడ్డులో ఉన్న గుంటూరు చానల్ (కొత్త కాలువ)కు వెళ్లాడు. ఈ సమయంలో ప్రమాదవశాత్తూ నీటిలో పడి గల్లంతు అయ్యాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని బాబ్జి(35) కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు ప్రశంసనీయం


కార్మికులకు ఆహారం, దుప్పట్లు పంపిణీ చేస్తున్న సరస్వతి

పెదకాకాని: కోవిడ్ సమయంలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు ప్రశంసనీయమని సరస్వతి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు కూరపాటి సరస్వతి అన్నారు. ఫౌండేషన్ ఏర్పాటు చేసి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా పెదకాకాని పంచాయతీలో పని చేస్తున్న 60 మందికి గురువారం ఆహారం, దుస్తుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు కంతేటి యలమందరావు, గుడిమెట్ల దానమ్మ, జెట్టి విజయలక్ష్మి, మానస, గుంటూరు సరిత పాల్గొన్నారు.

14న గోగులమూడిలో గ్రామీణ ఆటల పోటీలు

పెదనందిపాడు: సంక్రాంతి పండుగ సందర్భంగా 14న గోగులమూడిలో గ్రామీణ ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు కొమ్మరాజు సుబ్బరాజు ధర్మచెరువు, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అంగులూరి వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముగ్గుల పోటీలు, ట్రాక్టర్ ట్రాలీ రివర్స్, కబడ్డీ, పరుగు పందెం పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రథమ బహుమతిగా రూ. 3వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 2వేలు, తృతీయ బహుమతిగా రూ.వేయి ఇవ్వనున్నట్లు ఆయన తెలియజేశారు. వివరాలకు 9533976680కు ఫోన్ చేసి సంప్రదించాలని ఆయన సూచించారు.

అలరించిన పంచరత్న కీర్తనలు


త్యాగరాజ కీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు

పాత గుంటూరు: లక్ష్మీపురంలోని శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 176వ సద్గురు శ్రీ త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా శ్రీ త్యాగరాజస్వామి ఆలయంలో శ్రీ సీతారాములకు, శ్రీ త్యాగరాజుకు విశేష అభిషేకార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక కళాకారులు, వాయిద్య కళాకారులు పంచరత్న సేవతో శ్రీ త్యాగరాజ స్వామిని కొలిచారు. నేమాని నాగలక్ష్మి బృందం శ్రీ త్యాగరాజ చరితం హరికథా గానం సంగీత అభిమానుల్ని అలరించింది.

పార్టీలో ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు

- రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి
- వడ్లమూడిలో పొన్నూరు నియోజకవర్గ ఆత్మీయ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి

చేబ్రోలు: వైఎస్సార్ సీపీలో పని చేస్తున్న ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి తెలిపారు. చేబ్రోలు మండలం వడ్లమూడిలోని కృష్ణా గార్డెన్స్‌లో గురువారం పొన్నూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కుటుంబసభ్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య అధ్యక్షత వహించారు. రాజ్యసభ సభ్యుడు ఆళ్ల ఆయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని తెలిపారు. పార్టీలోని చిన్న చిన్న సమస్యల్ని పరిష్కరించుకుని పొన్నూరు నియోజకవర్గంలో జెండాను తిరిగి ఎగురవేయాలని సూచించారు. ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ రానున్నది పరీక్షా కాలమన్నారు. టీడీపీ ప్రజల్ని మోసగించి, మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లో సంక్షేమ పథకాలు అందించడంతో పాటు, అభివృద్ధి కార్యక్రమాలు


హాజరైన వైఎస్సార్ సీపీ శ్రేణులు

చేపట్టినట్లు తెలిపారు. వలంటీర్, గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకు ప్రభుత్వ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ పరిశీలకుడు గౌతంరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో పొన్నూరు పట్టణం, రూరల్, పెదకాకాని, చేబ్రోలు మండలాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. చివరగా నేతలు అన్ని గ్రామాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులను వ్యక్తిగతంగా కలిసి వారి సమస్యలు, ఇబ్బందుల్ని పార్టీ పరిశీలకులు నమోదు చేసుకున్నారు.

యువత పైనే దేశ భవిష్యత్తు

స్టెప్ సీఈవో పి.వి. నారాయణ


విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో వివేకానంద చిత్రపటానికి నివాళి

గుంటూరు రూరల్: దేశ భవిష్యత్తు యువత పైనే ఆధారపడి ఉందని స్టెప్ సీఈవో పి.వి. నారాయణ తెలిపారు. ప్రతి విద్యార్థి ఉన్నతంగా చదివి సమాజాభివృద్ధికి కృషి చేయాలని చెప్పారు. పెదపలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన జాతీయ యువజనోత్సవాలు, స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. ప్రతి విద్యార్థి వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకుని లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు. దృఢ సంకల్పంతో కృషి చేస్తే సాధించలేనిది ఏదీ లేదని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ పి. రాధిక మాట్లాడుతూ స్టెప్, స్వశక్తి, యూత్ సర్వీసెస్ ఆధ్వర్యంలో యువజనోత్సవాల్ని నిర్వహించడం సంతోషకరమని చెప్పారు. అనంతరం విద్యార్థులకు క్రీడలు, వక్తృత్వం, వ్యాస రచనలు పోటీల్ని నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నెహ్రూ యువజన కేంద్రం సభ్యురాలు కిరణ్మయి పాల్గొన్నారు.

చలపతి ఫార్మసీ కళాశాలలో....


చలపతి ఫార్మసీ కళాశాలతో సంక్రాంతి ముగ్గుల పోటీలో విద్యార్థినులు

స్వామి వివేకానందను ప్రతి ఒక్కరూ మార్గదర్శకంగా తీసుకుని లక్ష్య సాధన దిశగా కృషి చేయాలని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు తెలిపారు. నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని గత నాలుగు రోజులుగా జరుగుతున్న జాతీయ యువజనోత్సవాలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సీఎల్‌పీటీ కార్నివాల్ పేరుతో పూర్వ విద్యార్థుల సంఘం, మహిళల విభాగం ఆధ్వర్యంలో యువజనోత్సవాల్ని నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులకు క్విజ్, క్రీడలు, సంప్రదాయ వస్త్ర ధారణ, ముగ్గులు, వ్యాస రచన, నాటకాలు, సంక్రాంతి సంబరాలు తదితర పోటీల్ని నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చలపతి విద్యాసంస్థల అధినేత వై.వి. ఆంజనేయులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో...

యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకుని, దృఢ లక్ష్యంతో ఉన్నత శిఖరాల్ని చేరేందుకు కృషి చేయాలని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. చంద్రశేఖర్ తెలిపారు. నగర శివారు లాం నందున్న కళాశాలలో గురువారం స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి యువకుడు భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలని, గమ్యం చేరేందుకు సమష్టిగా కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె. కిరణ్‌కుమార్, ఎ. రాధాకృష్ణమూర్తి, ఎస్. సత్యనారాయణ, కె. వెంకటరామారావు పాల్గొన్నారు.

శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో వేడుకలు


భోగి మంటలు వేస్తున్న ఎంపీడీఓ, సీడీపీఓలు

పొన్నూరు: సంక్రాంతి పండుగను మండల ప్రజలంతా సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని ఎంపీడీఓ మారుతి శేషమాంబ ఆకాంక్షించారు. స్థానిక శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో గురువారం భోగి మంటలు వేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ సెక్టార్ పరిధిలోని అన్ని గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు, ఐసీడీఎస్ సీడీపీఓ వెంకటరమణ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను ముందస్తుగా నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. పండుగ అందరి ఇళ్లలో సంతోషాన్ని నింపాలని ఆకాంక్షించారు. సీడీపీఓ వెంకట రమణ మాట్లాడుతూ పొన్నూరు ప్రాజెక్ట్‌లోని అన్ని సెంటర్లలో ముందస్తుగా భోగి మంటలు నిర్వహించి, ప్రీస్కూల్ పిల్లలకు భోగి పండ్లు పోసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పద్మజ, సెక్టార్‌లోని కార్యకర్తలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో 500 మందికి పరీక్షలు

పెదకాకాని: కేరింగ్ క్లాడ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నంబూరులోని శ్రీ దశావతార వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. 500 మందికి వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో వైద్యులు ఎం. గాయత్రి, ఎం. సాయి యశ్వంత్, నిఖిత, మోహనప్రియ, పి. రమేష్, కె. వెంకటేశ్వర్లు, కె. మంజీర, డి. శ్రీకాంత్, ప్రవీణ్, వి. కృష్ణ స్రవంత్, కాశీరామ్, అనీల, ప్రణీత్, హారిక సేవలందించారు. ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ గోపీనాథ్ మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్యంపై విస్తృత ప్రచారం నిర్వహించి వారిలో చైతన్యం తీసుకు రావడమే ఆర్గనైజేషన్ ముఖ్య ఉద్దేశమని వివరించారు.

మిఠాయి దుకాణంపై రెండు కేసులు నమోదు


కొత్తపేటలోని షాపులో తనిఖీ నిర్వహిస్తున్న లీగల్ మెట్రాలజీ అధికారులు

నెహ్రూనగర్: తూకాల్లో తేడా వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ కొండారెడ్డి హెచ్చరించారు. డెప్యూటీ కంట్రోలర్ షాలేం రాజుకు అందిన ఫిర్యాదు మేరకు కొత్తపేటలోని సాయి అభిలాష్ మిఠాయి దుకాణంలో గురువారం కాటాల్ని తనిఖీ చేశారు. తూకంలో తేడాతో పాటు కాటాలకు స్టాంపింగ్ లేకపోవడం గమనించి రెండు కేసులు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు. తనిఖీల్లో సిబ్బంది సైదా పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెక్కు పంపిణీ


సావిత్రికి చెక్కును అందజేస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థలో కార్మికులకు అండగా ఉంటామని, పరిహారాల్ని వెంటనే అందించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. ఇటీవల మరణించిన ఇంజినీరింగ్ విభాగ కార్మికుడి భార్యకు ఎక్స్‌గ్రేషియా చెక్‌ని ఆమె అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్‌లో అవుట్ సోర్సింగ్ కార్మికుడిగా పని చేస్తున్న చిరుమామిళ్ల రాజారావు ఇటీవల కాలంలో మరణించారని, ఆయన భార్య సావిత్రికి రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును అందజేసినట్లు చెప్పారు.

చెత్త సేకరణ సమర్థంగా చేపట్టాలి

నగరంలో చెత్త సేకరణ సమర్థంగా చేపట్టాలని, తడి, పొడిగా వేర్వేరుగా చేయాలని కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో గురువారం ప్రజారోగ్య విభాగ అధికారులతో, జూమ్ ద్వారా శానిటేషన్ కార్యదర్శులతో నగరంలో పారిశుద్ధ్య పనులు, ఇంటింటి చెత్త సేకరణ, ట్రేడ్ లైసెన్స్‌లపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర ప్రజలు మూడు డస్ట్‌బిన్లు వాడే విధంగా వారికి అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రజల్లో అవగాహన కలిగించి ఆర్టీసీ కాలనీ భాష్యం స్కూల్ దగ్గర గార్బేజ్ వల్నరబుల్ పాయింట్‌ని లిట్టర్ ఫ్రీగా మార్చిన సచివాలయం 4, 5, 6 కార్యదర్శులను అభినందించారు. కార్యదర్శులంతా విధుల్లో శ్రద్ధ చూపాలని ఆమె చెప్పారు. ప్రజలకు హోం కంపోస్ట్ తయారీ, ప్రాధాన్యత గురించి అవగాహన కల్గించాలని తెలిపారు. అపార్ట్‌మెంట్స్‌లో క్లస్టర్ కంపోస్ట్ యూనిట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 2023 స్వచ్ఛ సర్వేక్షణ్‌లో గుంటూరు నగరం మెరుగైన ర్యాంక్ సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కమిషనర్ చెప్పారు. సమావేశంలో ఎంహెచ్ఓ డాక్టర్ భానుప్రకాష్, ఈఈ కొండారెడ్డి, డీఈఈ హనీఫ్, యస్‌యస్‌లు ఆనందకుమార్, రాంబాబు, ఆయూబ్ ఖాన్, సోమశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

నగరంలో పచ్చదనం పెంపునకు కృషి

మేయర్ కావటి


పార్కును ప్రారంభిస్తున్న మేయర్ కావటి, ఎమ్మెల్యే ముస్తఫా, కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా మార్చడానికి నగరపాలక సంస్థ ప్రత్యేక కృషి చేస్తోందని మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు తెలిపారు. ఆర్టీసీ కాలనీ 5వ లైన్‌లో గురువారం రూ.42 లక్షలతో అభివృద్ధి చేసిన మున్సిపల్ కార్పొరేషన్ పార్కును ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా, కమిషనర్ కీర్తి చేకూరితో కలసి మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో పచ్చదనం పెంపునకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, అందులో భాగంగా ఆర్టీసీ కాలనీ 5వ లైన్‌లో అర ఎకరంలో స్థానికులకు ఉపయోగపడేలా, ఆహ్లాదం, ఆరోగ్యం అందించేలా పార్కును అభివృద్ధి చేశామని తెలిపారు. ఇప్పటికే కాలనీలో ఒక పార్కు ఉన్నప్పటికీ, మరొక పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఇదే ప్రాంతంలో త్వరలో స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని వెల్లడించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అతి తక్కువ కాలంలోనే ఆర్టీసీ కాలనీలో పార్కును అభివృద్ధి చేయడం అభినందనీయమని తెలిపారు. నగరంలో పచ్చదనం పెంపు ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన ఆక్సిజన్‌ని అందించవచ్చని చెప్పారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని కాలనీల్లో పార్కుల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. గాంధీ పార్కు పనులు కూడా వేగంగా జరిగేలా ఈఈ స్థాయి అధికారికి ప్రత్యేక పర్యవేక్షణ బాధ్యతలు కేటాయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ షేక్ సజీల, స్థానిక కార్పొరేటర్ కె.రంగారెడ్డి, ఏడీహెచ్ రామారావు, ఈఈ కోటేశ్వరరావు, డీఈఈ కల్యాణరావు, ఏఈ సేతుబాబు, సచివాలయం కార్యదర్శులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకే పథకాలు

ఎమ్మెల్యే మేకతోటి సుచరిత


వల్లూరులో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

వల్లూరు(కాకుమాను): ప్రజల వద్దకే ప్రభుత్వ పథకాల్ని అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో సచివాలయాల్ని ఏర్పాటు చేసినట్లు ప్రత్తిపాడు శాసన సభ్యురాలు మేకతోటి సుచరిత తెలిపారు. మండలంలోని వల్లూరులో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలతో పాటు రైతులు, ప్రజల సమస్యల్ని అక్కడికక్కడే పరిష్కరించాలనే లక్ష్యంతో గ్రామాల్లో సచివాలయాల్ని ఏర్పాటు చేసి కొన్ని లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చిన ఘనత దేశ చరిత్రలో ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందని ఆమె తెలిపారు. సచివాలయాల్లో దాదాపు 413 రకాల సేవల్ని అందిస్తున్నట్లు చెప్పారు. గతంలో ఏ పనికైనా మండల కేంద్రాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు ప్రజలకు ఆ అవస్థ తప్పిందని పేర్కొన్నారు. కులాలు, మతాలు, ప్రాంతాలు, పార్టీలు చూడకుండా అర్హతే ఆధారంగా పింఛన్లు మంజూరు చేస్తుంటే, కొన్ని పత్రికలు తప్పుడు రాతలు రాస్తున్నాయని సుచరిత మండిపడ్డారు. పండుగైనా, ఆదివారమైనా ఒకటో తేదీ వేకువ జామునే అవ్వా తాతల తలుపులు తట్టి వారి చేతుల్లో పింఛన్ నగదు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు ముజావర్ గుల్జార్ బేగం, ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ వింతా రాఘవరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు తియ్యగూర వెంకటరెడ్డి, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ పొన్నూరు షేక్ కరీముల్లా, ప్రత్తిపాడు మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మెరిగల రవిబాబు, మునగాల వీరారెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ ముప్వా గంగిరెడ్డి, పార్టీ గ్రామ అధ్యక్షుడు ఆళ్ల శివకోటిరెడ్డి, లింగంగుంటపాలెం సర్పంచ్ చంద్రశేఖరరెడ్డి, తహసీల్దార్ జె.ప్రసాదరావు, ఎంపీడీఓ కె.శరత్‌బాబు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గణేష్ నగర్ రోడ్లకు మహర్దశ


రోడ్డు, సీసీ డ్రెయిన్లకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ కృష్ణారెడ్డి తదితరులు

గుంటూరు రూరల్: నగరంలోని శివారు కాలనీల్లో సైతం సకల సౌకర్యాల్ని కల్పించి వాటి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని 48వ డివిజన్ రెడ్డిపాలెం కార్పొరేటర్ తనబుద్దు కృష్ణారెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని గణేష్‌నగర్‌లో గురువారం రూ. 27 లక్షలతో నూతనంగా నిర్మించనున్న రోడ్డు, సీసీ డ్రెయిన్లకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వాలు విలీన గ్రామాల్ని పట్టించుకోలేదని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ఆధ్వర్యంలో 90 శాతానికి పైగా రోడ్లు, సీసీ డ్రెయిన్లు, తాగునీరు వంటి సౌకర్యాల్ని కల్పించినట్లు తెలిపారు. ప్రతి కుటుంబాన్నీ ఆర్థికంగా అభివృద్ధి చేయడమే జగనన్న లక్ష్యమని, అందుకే అనేక సంక్షేమ పథకాల్ని ప్రతి ఇంటికీ చేరుస్తున్నారని వివరించారు. ప్రతి ఒక్కరూ జగనన్నకు అండగా నిలిచి రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక


విద్యాబుద్ధులు నేర్పిన గురువులతో పూర్వ విద్యార్థులు

ప్రత్తిపాడు: వారంతా చదువులమ్మ చెట్టు నీడలో ఒక్కటయ్యారు.. కలిసి చదువుకున్నారు.. ఆటలాడారు.. అల్లరి చేశారు. ఏళ్లు గడిచాయి. పదవ తరగతి పూర్తి అవ్వగానే ఎవరి దారిన వారు తలో దిక్కుకు వెళ్లిపోయారు. ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడు చిరుమామిళ్ల రంగయ్య, శేషమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998 సంవత్సరం 10వ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు గురువారం పాఠశాల వేదికగా కలిశారు. సుమారు పాతికేళ్ల తర్వాత కలసిన వారంతా అలనాటి జ్ఞాపకాల్ని పంచుకున్నారు. తమకు చదువులు చెప్పిన గురువుల పాదాలకు నమస్కరించారు. దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. చిరుమామిళ్ల వెంకట రత్నం, విజయమ్మలను సన్మానించారు.

కార్పొరేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల సందడి


కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ క్రీడా ప్రాంగణంలో సంక్రాంతి సంబరాల్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధ, గురువారాల్లో నగరపాలక సంస్థ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలైన విద్యార్థులకు సంక్రాంతి సంబరాల ముగింపు రోజైన 15న స్టేడియంలో ముఖ్య అతిథుల చేతుల మీదుగా మెమెంటోలు, ప్రశంసా పత్రాల్ని అధికారులు అందజేయనున్నారు.

నేడు ఎన్టీఆర్ స్టేడియంలో ముగ్గుల పోటీలు

నగరపాలక సంస్థ సంక్రాంతి సంబరాలలో భాగంగా ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. సందేశాత్మక ముగ్గులలో ఎంపికైన మొదటి, ద్వితీయ, తృతీయ విజేతలకు ప్రత్యేక బహుమతులను అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన మహిళలు, విద్యార్థినులు పాల్గొనాలని ఆయన కోరారు. సంక్రాంతి సంబరాల ప్రత్యేక పర్యవేక్షణ అధికారి, డెప్యూటీ కమిషనర్ వెంకట కృష్ణయ్య మాట్లాడుతూ ముగ్గుల పోటీలకు వచ్చేవారు రంగుల్ని తెచ్చుకోవాలని సూచించారు. పోటీలను ఉదయం 8 గంటల నుంచి ప్రారంభిస్తామని, పాల్గొనదలచిన వారు ముందుగా వచ్చి ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమాచార కేంద్రంలో (హెల్ప్ డెస్క్) పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. ముగ్గుల పోటీలతో పాటు శుక్రవారం క్రీడా ప్రాంగణంలో ఉదయం మ్యూజికల్ చైర్ గేమ్స్, పాటల పోటీలు, మిమిక్రీ, మ్యూజిక్, మైమ్ పోటీలు సాయంత్రం రుద్రకళాక్షేత్రం కర్ర సాము ప్రదర్శన, నాట్య విశారద మాచిరాజు రాజేష్ కూచిపూడి, జానపదం, భారత నాట్యం ప్రదర్శన, కాసుల కృష్ణారావు, అంజన్ కుమార్ మిమిక్రీ ప్రదర్శన, టాకింగ్ డాల్, మ్యాజిక్ షో తదితర ప్రదర్శనలు ఉంటాయని వివరించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

గుంటూరు ఈస్ట్: జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ వృద్ధుడి మృతిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. దేవాపురం 2వ లైనులో నివసించే మేకల కృష్ణ (62) కొద్ది రోజుల కిందట మెట్ల మీద నుంచి జారిపడి గాయపడ్డాడు. జీజీహెచ్‌లో చికిత్స పొందాడు. ఆ తర్వాత ఇంట్లో వేడి నీరు చేతి మీద పడి తీవ్ర గాయమైంది. దానికి ఇన్‌ఫెక్షన్ సోకి జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.